క్లుప్తంగా

వేతనాల పెంపునకు పోరాటం

గద్వాల క్రైం: జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికుల వేతనాల పెంపుకై ప్రతి కార్మికుడు పోరాటానికి సిద్ధం కావాల్సిందిగా ఏఐటీయూసీ రాష్ట్ర మెడికల్ కార్యదర్శి సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా ఆస్పత్రిలో కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జీవో నంబర్ 60 ప్రకారం ఇవ్వాలని జీతం రూ.15,600 గాను 25 శాతం పీఎఫ్, ఈఎస్ఐ వాటా చెల్లించకుండా రూ.11వేలు చెల్లించడం సబబు కాదన్నారు. కార్మికులపై అదనపు పని భారం మోపుతూ వెట్టి చాకిరి చేయిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కిన ఏజెన్సీ నిర్వాహకులపై న్యాయ పోరాటం చేద్దామని వారు పిలుపునిచ్చారు.

మోస్తారు వర్షం



ధరూరు: మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం ఓ మోస్తారు వర్షం కురిసింది. మూడు రోజులు నుంచి దంచికొడుతున్న ఎండలతో జనం ఉక్కపోతతో అల్లాడిపోయారు. కురిసిన వర్షంతో వాతావరణం ఒక్క సారిగా చల్లబడింది. ఎలాంటి గాలులు, మెరుపులు చడీ చప్పుడు లేకుండా వర్షం కురిసింది. రైతులు, కూలీలు, జనం కురిసిన వర్షంతో ఊరట చెందారు.

మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం

మానవపాడు: మండలంలోని గ్రామాలలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు శుక్రవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి గుంతలను తవ్వించారు. వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని కొన్ని గ్రామాలలో మొక్కలను నాటారు. మరికొన్ని గ్రామాలలో వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటే విధంగా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు.

కళాకారులకు సన్మానం



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కొండేరులో పోతురాజు శంకరమ్మ ట్రస్ట్ చైర్మన్ సోమనాద్రి పలువురు కళాకారులను సన్మానించారు. సమాజంలో పాటల రూపంలో వారు చేస్తున్న సేవలను అభినందించి కళాకారులు రెంచర్ల రాజేష్, రేలారే ప్రసాద్, మల్లన్నలకు ఆయన నివాసంలో పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రవి, బీచుపల్లి, అశోక్, తిమ్మప్పగౌడ్, లక్ష్మన్న, పెద్ద సవరన్న, కొండన్న, తదితరులు ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులకు అండగా ఉంటాం

అలంపూర్: హాస్టల్ విద్యార్థులకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాము అన్నారు. పట్టణంలోని హరిత హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న హాస్టల్ ఎక్కడికి తరలించడం లేదన్నారు. హాస్టల్‌ను తరలిస్తున్నారనే సమాచారంతో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు. అదేవిధంగా ఉన్నత విద్యా మండలి కార్యదర్శి బుర్ర వెంకటేశంతో మాట్లాడి హాస్టల్ ఇక్కడే కొనసాగించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో చదివే విద్యార్థులు ఆందోళన చెందవద్దన్నారు. విద్యార్థులు హాస్టల్‌ను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. గోపాల్, పెద్దబాబు, నర్సింహ, ధర్మరాజు, జాన్, స్వాములు ఉన్నారు.

అంగన్‌వాడీలకు యాప్‌లపై అవగాహన ఉండాలి

గట్టు: అంగన్‌వాడీ టీచర్లు పోషణ్ ట్రాక్, న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ (ఎన్‌హెచ్‌టీఎస్) యాప్‌లపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని డీడబ్ల్యూఓ సుధారాణి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఆస్పరేషన్ బ్లాక్‌లో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీడబ్ల్యూఓ మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో రోజు వారీగా నిర్వహించే దిన చర్యలకు సంబంధించి ఖచ్చితమైన సమాచారాన్ని యాప్‌ల ద్వారా నమోదు చేయాలన్నారు. కేంద్రాల్లో ప్రీ స్కూల్ యాక్టివిటీస్, చిన్నారుల పెరుగుదల పర్యవేక్షణ, సామాజిక, సాంస్కృతి కార్యక్రమాలు, ఆరోగ్యలక్ష్మి వివరాలు, గృహ సందర్శనలకు రోజు వారి నివేదికలను నమోదు చేయాలన్నారు. వివరాల నమోదుపై నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీడీపీఓ కమలాదేవి, శిక్షకులు రఘు, కల్యాణ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



అలంపూర్‌లో యోగాసనాలు వేస్తున్న బీజేపీ నాయకులు



జల్లాపురంలో యోగా చేస్తున్న విద్యార్థులు



అయిజ మండలం మేడికొండలో..

యోగాతో మానసిక ప్రశాంతత

గద్వాల క్రైం: మానసిక ఒత్తిళ్లు, నిలకడ లేని ఆలోచనల నుంచి విజయం సాధించాలంటే యోగాతోనే సాధ్యమవుతుందని జిల్లా జడ్జి కే.కుష, జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి శశికళ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కోర్టు, వైద్యా ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. వారు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. మారుతున్న పరిస్థితిల నేపథ్యంలో ప్రతి ఒక్కరు తీవ్రమైన వేదన, చిరాకు, ఒత్తిళ్లు, ఆందోళనకు కుంగిపోతున్నారన్నారు. ప్రతి జఠిలమైన సమస్యల నుంచి విజయం సాధించాలంటే క్రమం తప్పకుండా యోగా చేయాలన్నారు.

అలంపూర్: పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో పీఎస్‌టీ సంజీవని, భవిష్యత్ భారత్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా ట్రెయినర్ రమ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి యోగా ఆసనాలు వేయించారు. సంగమేశ్వర ఆలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగమద్దిలేటి ఆధ్వర్యంలో నిర్వహించారు. సునిశితమైన శాస్త్రమే యోగాగా పేర్కొన్నారు. యోగా శాస్త్రం కొన్ని వేల ఏళ్ల క్రితమే దేశంలో ప్రభవించిందని వివరించారు.

మాంటిస్సోరిలో..

పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో పీఈటీ శివ నాయుడు ఆధ్వర్యంలో యోగ ఆసనాలు, సూర్య నమస్కారాలు, ఏకాగ్రతతో ధాన్యం చేయించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ కేఎస్‌వీ రవిప్రకాష్, హెచ్‌ఎం నాగలక్ష్మి మాట్లాడారు. నిత్యం యోగా చేయడం వలన శారీరక, మానసిక ఆరోగ్యం, ఒత్తిడి తగ్గి ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చన్నారు.



అలంపూర్ మాంటిస్సోరి పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

ఉండవెల్లి: పుల్లూరు మండల ఉన్నత పాఠశాలలో ఎస్‌బీఐ సంజీవని ఆధ్వర్యంలో విద్యార్థులతో హెచ్‌ఎం సువార్త ఆధ్వర్యంలో, తక్కశీల, బస్వాపురంలో అమృత్‌సర్ పథకంలో భాగంగా ఉపిధి కూలీలు పని చేసే చోటే యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని కలుగోట్ల కేజీబీవి విద్యార్థులు వరల్డ్ రికార్డ్‌లో భాగంగా ఆన్‌లైన్‌లో నిర్వహించే కార్యక్రమంలో 120 మంది పాల్గొన్నట్లు పీఈటీ అరుణతారా తెలిపారు.

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో మండల వైద్యాధికారి ప్రసూణరాణి, సీహెచ్‌ఓ లక్ష్మీకాంతం వైద్య సిబ్బందితో యోగా చేయించారు.

అయిజ: మండల కేంద్రంలో, గ్రామాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వీఆర్ పాఠశాలలో బీజేపీ నాయకులు విద్యార్థులతో కలిసి యోగా చేశారు.

రాజోళి: దైనందిన జీవితంలో యోగా అలవాటు చేసుకోవడంతో ఆరోగ్యం సిద్ధిస్తుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు తెలిపారు. మండల కేంద్రంలో యోగాపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీబీ నోడల్ పర్సన్ జయప్రకాష్, రామకృష్ణ, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాలలో పిరమిడ్ ఆధ్యాత్మిక సొసైటీ మాస్టర్ కొండారెడ్డి హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ యోగా మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంచుతుందన్నారు.

మానవపాడు: మండలంలోని జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాపై ప్రత్యేక తరగతులను నిర్వహించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులచే యోగా చేయించారు.

కేటీదొడ్డి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని హెచ్‌ఎం సులేమాన్ అన్నారు. మండలంలోని పరిధిలోని మల్లాపురం, కొండాపురం, ఇర్కిచేడు పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో యోగా చేయించారు.

ధరూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రేవతి ఆధ్వర్యంలో యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించడంతో పాటు యోగా వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. రైల్వేస్టేషన్ వద్ద బీజేపీ నాయకులు కుర్వ కిష్టన్న, రామాంజనేయులు, కాంగ్రెస్ నాయకులు రాజారెడ్డి, వెంకటేష్ ఆధ్వర్యంలో యోగాసానాలు వేశారు.

మల్దకల్: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ యోగా చేయడంతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ప్రిన్సిపాల్ రమేష్‌లింగం సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రామాంజనేయులుగౌడ్, నర్సింహులు విద్యార్థులకు యోగా చేయించారు.

గట్టు: గండి ఆంజనేయస్వామి ఆలయం దగ్గర బీజేపీ నాయకులు పలు యోగాసనాలు వేశారు.



కేటీదొడ్డి మండలం మల్లాపురం పాఠశాలలో..



ఎర్రవల్లి సరస్వతి పాఠశాలలో..



ధరూరు రైల్వే స్టేషన్ వద్ద యోగా చేస్తున్న నాయకులు



గట్టు మండల కేంద్రంలో..



జిల్లా కేంద్రంలో యోగాసనాలు చేస్తున్న వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది



అలంపూర్ కస్తూర్బా పాఠశాలలో యోగాసనాల్లో విద్యార్థులు



తక్కశీలలో యోగాసనాలు వేస్తున్న ఉపాధి కూలీలు



జూలెకల్‌లో యోగా చేస్తున్న యువకులు, వృద్ధులు

బాగు చేసేదెప్పుడో?



గుంతలమయమైన రామాపురం రహదారి

- అధ్వానంగా మారిన గ్రామాల బీటీ రోడ్లు
- టిప్పర్లు, ట్రాక్టర్ల జోరుతో గుంతలమయం
- ఇబ్బందులు తొలగించాలని కోరుతున్న వాహనదారులు

శాంతినగర్: అసలే అంతంత మాత్రంగా వేసిన రహదారులు.. ఆపై ఓవర్‌లోడ్‌లతో తరచూ టిప్పర్లు, ట్రాక్టర్లు తిరుగుతూ మారుమూల గ్రామాల రోడ్లు అధ్వాన్నంగా మారాయి. గుంతలమయమైన రోడ్లతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని తుంగభద్ర నదీతీర గ్రామాలైన చిన్నధన్వాడ, తుమ్మిళ్ల, మద్దూరు, పుల్లూరు, వేణిసోంపురం సమీపంలోని నిత్యం టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. అంతేగాక ఆయా గ్రామాలకు సమీపంలోని గట్ల నుంచి ఎర్రమట్టిని టిప్పర్లు, ట్రాక్టర్లతో తీసుకువెళ్తుండటంతో వడ్డేపల్లి, రాజోళి, మానవపాడు, అయిజ, ఉండవెల్లి, ఇటిక్యాల మండలాల్లోని పంచాయతీరాజ్‌శాఖ, ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి. నిత్యం వందలాది వాహనాల్లో ఇసుక, ఎర్రమట్టి తరలిస్తుండటం, 30 నుంచి 40 టన్నుల బరువైన వాహనాలు రోడ్లపై వెళ్తూ రహదారులు గుంతలమయం అయ్యాయి. దీంతో బైక్‌లు, కార్లు, ఆటోలపై వెళ్లే ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రతి ఏడాది ఇసుక, ఎర్రమట్టి ద్వారా ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా రోడ్లకు మరమ్మతులు చేపట్టడం లేదని నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్ల దుస్థితి ఇలా..

వడ్డేపల్లి మండలంలోని తనగల, కొంకల, జూలెకల్, రామాపురం, జిల్లెదుదిన్నె, జక్కిరెడ్డిపల్లి, కోయిల్‌దిన్నె రహదారులు గుంతలమయమై ప్రయాణానికి నరకంగా మారాయి. రాజోళి మండలంలోని తూర్పుగార్లపాడు, మాన్‌దొడ్డి, పచ్చర్ల, పెద్దతాండ్రపాడు, తుమ్మిళ్ల, అయిజ మండలంలోని వెంకటాపురం, యాపదిన్నె, మేడికొండ, తుపత్రాల, ఉత్తనూరు, గుడిదొడ్డి, జడిదొడ్డి, ఇటిక్యాల మండలంలోని వావిలాల, సాతర్ల, ఉదండాపురం, ఉండవెల్లి మండలంలోని పోతులపాడు, చెన్నిపాడు, మానవపాడు మండలంలోని మద్దూరు, కలుకుంట్ల, అమరవాయి, మానవపాడు రోడ్లు దెబ్బతిన్నాయి.

దుమ్ముతో ఇక్కట్లు

రోడ్లకు వేసిన బీటీ లేచిపోవడంతో ప్రధాన రహదారులు మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. తనగల రహదారి పూర్తిగా పాడవడంతో ఎర్రమట్టి వేసి మమ అనిపించుకున్నారు. దీంతో టిప్పర్లు, ట్రాక్టర్లు వెళ్లే సమయంలో దుమ్ము, ధూళి వస్తూ వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

రోడ్డు మొత్తం గుంతలు



మా గ్రామం మీదుగా రోజు మట్టి, ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లు వెళ్తుంటాయి. ఐదేళ్లుగా భారీ వాహనాలు వెళ్తూ రోడ్లు గుంతలమయమై ప్రయాణానికి ఇబ్బందికరంగా మారాయి. తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నాం. వాహనాలు దెబ్బతింటున్నాయి. ఆటోల్లో వెళ్లే వారి పరిస్థితి దారుణం. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి రోడ్లు బాగుచేయించాలి.

– రామకృష్ణ, కొంకల, వడ్డేపల్లి మండలం

దుమ్ముతో ఇక్కట్లు



నిత్యం వందల కొద్ది వాహనాలు తిరుగుతుంటాయి. దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరుతుంది, అంతేగాకుండా రోడ్లపై వెళ్లే వారి చుట్టూ చేరుతుంటుంది. వాహనాలు నడిపే సమయంలో ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోంది. ఇళ్లలోని పాత్రలు, ఆహార పదార్థాలు దుమ్ము, ధూళి మయమై రోగాల బారిన పడుతున్నాం. దుమ్ము లేవకుండా రోడ్లపై నీళ్లు చల్లించాలి. –శ్రీధర్‌రెడ్డి, తనగల

ప్రతిపాదనలు పంపాం

దెబ్బతిన్న రహదారులకు మరమ్మతు చేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరుకాలేదు. నిధులు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి రోడ్లు బాగు చేయిస్తాం.

– ఆంజనేయులు, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ

రూ.కోట్లలో ఆదాయం ఉన్నా..

తుంగభద్ర నది నుంచి తరలించే ఇసుక ద్వారా ప్రభుత్వానికి ప్రతి ఏటా రూ.కోట్లలో ఆదాయం సమకూరుతోంది. అంతేగాక ఆయా గట్ల నుంచి తరలించే ఎర్రమట్టి ద్వారా మైనింగ్‌శాఖ నుంచి ఏటా రూ.కోట్లు ఆదాయం వస్తుంది. వేలకొద్ది ట్రిప్పుల మట్టి, ఇసుక తరలించడంవల్లే రోడ్లు పాడైపోయాయి. ఆదాయం కోసం ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేశారే గాని ప్రజలు, రోడ్ల గురించి ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రొ.జయశంకర్‌కు ఘన నివాళి



అయిజ: మండల కేంద్రంలోని ఎమ్మార్పీ కార్యాలయం వద్ద శుక్రవారం బీఆర్ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో ప్రొ.జయశంకర్ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేంద్ర, అనిల్, రమేష్, అంజి, నాగేష్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణం

అయిజ: పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా వేదమంత్రాలు పఠిస్తూ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు.

ఏరువాక పౌర్ణమి ఉత్సవాలు



ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో ఏరువాక పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం కంచుపాడు రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి అలంకరణ చేసి నైవేద్యాలు సమర్పించారు. మండల కేంద్రంలో ఎద్దులతో తోరణాలను ఊరవాకిలిలో కొరడాతో కొట్టి తెంచారు.

ప్రమాదకరంగా మారిన రహదారి

అలంపూర రూరల్: అలంపూర్ నుంచి బుక్కాపురం వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. రూ.కోట్లు వెచ్చి ఏర్పాటు చేసిన ఈ రహదారి కొద్దిరోజులకే గుంతలు పడ్డాయి. వాహనదారులు అదమరిచి నడిపితే ప్రమాదానికి గురికావాల్సిందే. నిత్యం ఈ రహదారి వెంట రైతులు, బుక్కాపురం గ్రామస్తులు తిరుగుతుంటారు. అధికారులు చొరవ చూపి రోడ్డు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం

- గ్రామాల్లో అవగాహన కల్పించని అధికారులు

ధరూరు: ప్లాస్టిక్ ఈ పేరు వినగానే ముందుగా మనకు గుర్తు వచ్చేది పర్యవరణానికి ముప్పు పొంచి ఉంటుందని. కానీ ఏదో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాల్లోనే హడావిడి చేసే అధికారులు నిషేధంపై దృష్టి సారించడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు సంతతో పాటు నిత్యవసర సరుకులు, కూరగాయలు వంటి వాటికి సైతం ప్లాస్టిక్ కవర్లనే వాడుతున్నారు. రెండేళ్ల క్రితం కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులు మండల కేంద్రంలో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. ఆ కొద్ది రోజులు మాత్రమే నిషేధం కొనసాగింది. నాలుగు రోజుల క్రితం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్లాస్టిక్ నిషేధ అంశాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల అధికారులను ఆదేశించినా ఇప్పటి వరకు ఎక్కడా చర్యలు తీసుకుంది లేదు.

నిబంధనలను కఠినతరం చేయాలి..

ప్లాస్టిక్ కవర్లు ప్రజలు వినియోగించకుండా ఉండాలంటే వ్యాపారుల వద్ద అందుబాటులో లేకుండా నిబంధనలు కఠినతరం చేయాలి. వినియోగదారులు ఇళ్ల వద్ద నుంచే నార లేదా పేపర్ బ్యాగులను తీసుకువచ్చే విధంగా చూడాలి. భావితరాలకు పొంచి ఉన్న ముప్పును వివరించాల్సిన అవసరం ఉంది.



చర్యలు చేపడతాం



ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కానీ పట్టించుకోవడం లేదు. దుకాణాలను, హోటళ్లను తనిఖీ చేసి 51 మైక్రాన్ల కన్న తక్కువ నాణ్యత కలిగి ఉంటే చర్యలు తీసుకుంటాం. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శుల ద్వారా తనిఖీలు చేస్తాం. కాగితపు, నార సంచులు వినియోగించేలా చూస్తాం.

– మంజుల, ఎంపీడీఓ, ధరూరు

మాజీ సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే నివాళి

అలంపూర్: అలంపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి గురువారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం సందర్శించి పూలమాలలతో నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వీరితోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, రుక్మద్దీన్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరు చెందిన శంకరమ్మ(65) అదృశ్యమైనట్లు కుమారుడు కాశీం శుక్రవారం ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ సుబ్బారెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 2వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదని తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

మానవపాడు: మండలంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రిజ్వాన తన్వీర్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలను చేశారు.